క్లుప్తంగా

బీజేపీ సభ్యత్వ నమోదు



ఎల్లంపల్లిలో సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలో ఎల్లంపల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా నాయకుడు బ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్నారన్నారు. ప్రపంచ దేశంలో భారత్‌కు గౌరవం దక్కుతుందంటే మోదీ కృషి, బీజేపీ ప్రభుత్వమే కారణమన్నారు. ఇందులో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, మండల కోశాధికారి దుర్గ ప్రసాద్, కార్యకర్తలు దుర్గయ్య, పెంటయ్య, మానెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మహిపాల్

నర్సాపూర్: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్డీఓ మహిపాల్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఇంటింటి సర్వే కార్యక్రమం సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్గదర్శకాల ప్రకారం సర్వే చేపట్టాలని, అన్ని ఇండ్లు కవర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



కొనుగోలు కేంద్రం తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు కుప్పలుగా పోసిన ధాన్యం, తూకాన్ని పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మండల పరిధిలో కేటాయించిన రైసు మిల్లులకు వెంటనే తరలించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

సర్వీస్ రిజిష్టర్ల పంపిణీ



రిజిష్టర్లు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇటీవల నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిష్టర్లను అందజేశారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్‌టీయుటీఎస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డి సహకారంతో సర్వీసు రిజిష్టర్లను అందించినట్లు పీజీహెచ్ఎం రాజేశ్వర్, రామచంద్రాచారి, అసోసియేట్ అధ్యక్షుడు విఠల్, రామకృష్ణాగౌడ్ తెలిపారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపి, ప్రసన్నకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు సుమంగళ, పాండురంగం, రాములు, సంతోష్, సుజిత్, ప్రవీణ్, కిషోర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



రామాయంపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు యాదగిరి, సుందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టులారీలతో ప్రమాదాలు

● పట్టించుకోని అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): పొట్టులారీలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్న వీటిని నియంత్రించడంలో సంబంధిత పోలీస్, ఆర్టీఏ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వివిధ ప్రాంతాల్లోని రైస్‌మిల్స్ నుంచి పొట్టును తరలిస్తున్న లారీలు, డీసీఎంలు నిబంధనలను పట్టించుకోవడం లేదు. నిత్యం తూప్రాన్ – నర్సాపూర్ హైవే గుండా పొట్టును తరలిస్తున్న లారీలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత లారీలు, డీసీఎంలు బాడీ కంటే అదనంగా ఇరుపక్కల, వెనకభాగం సంచులతో పొట్టును నింపేస్తున్నారు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలతో పాటు పక్క నుంచి వెళ్తున్న వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. పొట్టు వాహనాన్ని నడిపే డ్రైవర్‌కు సైతం వెనక నుండి వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి ఉండదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటి వల్ల ఏదో ఒక చోట ప్రమాదం జరిగిన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీనికి తోడు పొట్టులారీ వెళ్తున్న క్రమంలో వస్తున్న పొట్టు వల్ల ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



బాడీకంటే అదనంగా పొట్టు నింపి రవాణా చేస్తున్న లారీ

చర్యలు శూన్యం

పొట్టులారీలు పలుచోట్ల పాడైపోవడంతో అలాగే రోడ్డుపై నిలిపి ఉంచడం వల్ల బాడీ కంటే అదనంగా పొట్టు నింపి ఉండడంతో పార్కింగ్ లైట్లు సైతం కనిపించకుండా పోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. నిబంధనలకు వ్యతిరేకంగా దాన్యం పొట్టుని రవాణ చేస్తున్న వారిపై సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నిత్య ప్రమాదాలకు నిలయంగా మారిన పొట్టులారీలను నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



వాహన నిబంధనలు పాటించని పొట్టులారీలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు వ్యతిరేకంగా లారీ బాడికంటే అదనంగా రవాణా చేసే వ్యక్తులపై జరిమానా విధిస్తాం.

– రంగకృష్ణ, సీఐ

ముమ్మరంగా ఇంటింటి సర్వే



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్



శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో 10749 కుటుంబాలను 83 మంది ఎన్యూరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు వేశారన్నారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పక్కగా నిర్వహించేలా సూపర్‌వైజర్లు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

కొంతన్‌పల్లిలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి ఇంటి యజమాని వివరాలు నమోదు చేసుకొని స్టిక్కర్లు వేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వేను తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి పరిశీలించారు. ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి ప్రజలు పూర్తి సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

సర్వేకు సహకారం అందించాలి

చిన్నశంకరంపేట(మెదక్): సమగ్ర కుటుంబ కుల గణన సర్వేకు ముస్లింలు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని నార్సింగి మజీద్ కమిటీ అకౌటెంట్ షేక్ సలీం కోరారు. శుక్రవారం నార్సింగి మజీద్‌లో సర్వేపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు చాంద్ పాషా ఖురేషీ, అబ్దుల్ ఖాదర్, రబ్బానీ, యూసుప్, బాకర్‌పాషా, సదఖ్, గౌస్, జమీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని జంబికుంట, పెద్దశంకరంపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ యాసీన్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

క్యాన్సర్‌పై వైద్య శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో 12, 13 తేదీల్లో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫ్లెమింగ్ పరిశ్రమ ఎండీ ప్రకాష్ శుక్రవారం తెలిపారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వ హించాలనే సంకల్పంతో ఫ్లెమింగ్ లేబొరేటరీస్ లిమిటెడ్ వారి సౌజన్యంతో బసవతారకం ఇండో– అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాదు వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నవాబుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు పండించిన సన్నరకం ధాన్యం విషయంలో అధికారులు రైతులకు అన్యాయం చేయొద్దని మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి శుక్రవారం అన్నారు. ప్రస్తుతం సన్నరకం ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం వల్ల ఎక్కువ శాతం రైతులు సన్నరకం పంటలు సాగుచేశారన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వ్యర్థాలతో చెరువు నీరు కలుషితం

శివ్వంపేట(నర్సాపూర్): పౌల్ట్రీ యాచరీ ఫామ్ నుంచి బయటకు వదులుతున్న వ్యర్థాలతో చెరువు నీరు కలుషితం అవుతుందని కొంతన్‌పల్లి గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సుగుణ పౌల్ట్రీ యాచరీ ఫామ్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నిత్యం వ్యర్థాలు ఇష్టరాజ్యంగా వేస్తుండడం వల్ల గ్రామ శివారులో ఉన్న చెరువు, కుంటల్లోకి చేరి నీరు కలుషితం అవుతున్నాయని ఆరోపించారు. కలుషిత నీరు తాగడం వల్ల పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని రైతులు అన్నారు. వ్యర్థాల దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని నిరసిస్తూ యాచరీ ఎదుట ఆందోళన చేశారు. సంబంధిత అధికారులు స్పందించి.. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

విద్యుత్ సరఫరా చేస్తే సహించం

● గోకుల్ కాలనీవాసుల నిరసన

నర్సాపూర్ రూరల్: మా కాలనీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎలాంటి అనుమతులు లేని దుకాణాలకు విద్యుత్ సరఫరా చేస్తే సహించేది లేదంటూ బుధవారం సాయంత్రం నర్సాపూర్ పట్టణంలోని గోకుల్ కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడ్డ గోకుల్ కాలనీ వాసులమంతా సొంత డబ్బులతో నాణ్యమైన కరెంట్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే కాలనీలో అనేక కొత్త ఇళ్ల నిర్మాణం కావడంతో నిత్యం వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. నర్సాపూర్ – మెదక్ రహదారి పక్కన కొత్తగా డబ్బాలతో ఏర్పాటు చేసిన దుకాణాలకు ఫుట్ పాత్‌పై స్తంభాన్ని ఏర్పాటు చేసి, విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ వివరణ కోరగా, పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు భిక్షపతి, దేవేందర్ యాదవ్, శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.



స్తంభం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గోకుల్ కాలనీవాసులు

వాలీబాల్ జిల్లా టీమ్‌కు నార్సింగి విద్యార్థులు



జట్టుకు ఎంపికైన శ్రీజయ్, ఈశ్వర్

చిన్నశంకరంపేట (మెదక్): మెదక్ జిల్లా కేంద్రంలో జరిగే ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో పాల్గొనే వాలీబాల్ జిల్లా జట్టుకు నార్సింగి జెడ్పీపాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు జెడ్పీపాఠశాల హెచ్ఎం మురళి మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన జెడ్పీ పాఠశాలకు చెందిన శ్రీజయ్, ఈశ్వర్‌లను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు విజ్ఞానజ్యోతిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికివద్ద గల డాక్టర్ డీ. రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యసంస్థ, వ్యవసాయ కళాశాలలో ఈనెల 9న మొదటిసారి పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ అర్జునరావు, ఫీల్డ్ కోఆర్డినేటర్ జగదీష్ శుక్రవారం తెలిపారు.

◆ **వడియారంలో సదర్ ఉత్సవాలు**

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో సదర్ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు దున్నలను తీసుకొచ్చి విన్యాసాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అనిల్ యాదవ్, నాయకులు పరంజ్యోతి, ఉసామొద్దీన్, సాబేర్‌తో పాటు యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **నార్సింగి ఎంఈఓగా మురళీమోహన్**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి ఎంఈఓగా మురళీమోహన్ నియామకమయ్యారు. జెడ్పీపాఠశాల గెజిటెడ్ హెచ్ఎంగా కొనసాగుతున్న ఆయనను ఎంఈఓగా నియమిస్తూ డీఈఓ రాధాకిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎంఈఓ నీరజ, శేరిపల్లి కాంప్లేక్స్ హెచ్ఎం తిరుపతి, నార్సింగి జెడ్పీపాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, వెంకటేశ్వర శర్మ, సీఆర్‌పీలు శాంతికుమార్, సాయి, ఎంఐఎస్ నవీన ఉన్నారు.

◆ **దాతల సాయం సద్వినియోగం చేసుకోవాలి**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోసం దాతలు అందిస్తున్న సాయం సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలలోని 166 విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ బెల్టులు సమకూర్చగా ఎంఈఓ అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిందూమతి, తదితరులు ఉన్నారు.

◆ **కలిసి పని చేసే సామర్థ్యం వృద్ధి**



నర్సాపూర్: చెమెరా లాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో జట్టు భావాన్ని పెరగడంతో పాటు కలిసి పని చేసే సామర్థ్యం అభివృద్ధి చెందుతుందని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె చెప్పారు. శుక్రవారం కాలేజీలో చెమెరా–2.0 ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆయా కార్యక్రమాలతో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంతో పాటు బృంద కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభించిందని అన్నారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజనీరింగు హెచ్ఓడీ భానురాధిక, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ మాలిక, మేనేజర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్ ఎస్సీవాడలో బుధవారం నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పురోహితుడు దత్త రామశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, యంత్ర పూజ, విగ్రహ ప్రతిష్ఠతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం కల్లూరి ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం భక్తి భజన కార్యక్రమాలు చేపట్టారు.

◆ **సన్మానం**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లితండా పాఠశాల హెచ్ఎం మల్లేశం బదిలీ అయ్యారు. పాఠశాల హెచ్ఎం మల్లేశం 12 ఏళ్లుగా పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తూ, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు గ్రామస్తులకు కూడా అనేక రకాల సేవా కార్యక్రమాలు, సూచనలు అందించారని గ్రామ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నీతిన్, బాషా, ఆశోక్, చత్రియ తదితరులు పాల్గొన్నారు.

◆ **కొనుగోలు కేంద్రాల తనిఖీ**



నర్సాపూర్ రూరల్: మండలంలోని తుల్జారాంపేటతో పాటు ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం నర్సాపూర్ తాహసీల్దార్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. తూకం చేసిన వెంటనే ధాన్యాన్ని ట్రాన్స్‌పోర్ట్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్

తూప్రాన్: డ్రగ్స్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్‌అన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని నలంద జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం–సైన్స్–మూఢనమ్మకాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నరేష్ హాజరై మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి, శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



విద్యార్థులకు మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పిస్తున్న నరేశ్

మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జానీ భాష, నర్సింలు, పెంటయ్య, ప్రిన్సిపాల్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి, ఇతర పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బృందాలకు ఈజీఎస్ సిబ్బంది సహకరించాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృంద సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి పనులపై నివేదికలను అందజేస్తారన్నారు. ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠల్ రెడ్డి, ఏపీఓ నవాజుద్దీన్ తదితరులున్నారు.

భగవద్గీత పోటీలు జయప్రదం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గీతా జయంతి ఉత్సావాలను పురస్కరించుకొని వచ్చే నెల 7న మండలంలోని జగ్గంపేట నవబారత్ మోడల్ స్కూల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలు జయప్రదం చేయాలని జిల్లా టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు లక్ష్మీనారాయణశర్మ అన్నారు. శుక్రవారం జగ్గంపేట పాఠశాలలో హెచ్ఎం శ్రీకాంత్ విద్యార్థులకు భగవద్గీతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగవద్గీతలోని ఆరవ అధ్యాయము ఆత్మ సంయమయోగః అనే అంశం కంఠస్థ పోటీల్లో ఉంటుందన్నారు. 6, 7, 8, 9 తరగతులకు రెండు విభాగాలుగా పోటీలు ఉంటాయని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు డి. శ్రీకాంత్ 9704742553, లక్ష్మీనారాయణ 9440214296 లను సంప్రదించాలన్నారు.



జగ్గంపేటలో విద్యార్థులకు భగవద్గీతలను పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

పునఃప్రారంభమైన పశువైద్యశాల



వైద్యసేవలను ప్రారంభిస్తున్న వైద్యాధికారిణి

టేక్మాల్(మెదక్): మండలంలోని వేల్పుగొండ గ్రామంలో కొన్నేళ్లుగా మూతబడిన పశు వైద్యశాలను శుక్రవారం పునఃప్రారంభించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో పశువైద్యశాలకు పశు వైద్యాధికారిణి సౌమ్యతో పాటు కంపౌండర్ సుధాకర్‌ను నియమించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రామ ఉపసర్పంచ్ ప్రేమ్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు అబ్రహం, కాంగ్రెస్ గ్రామ నాయకులు అబ్బనీ సాయిలు, అబ్బనీ యేగేందర్, నర్సింలు, సుధాకర్, రాములు, శివన్నగారి సంగయ్య, కృష్ణ గౌడ్, సాయిలు, మణేయ్య, జాను, విల్సన్, ధన్‌సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీని సందర్శించిన విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ విభాగం విద్యార్థులు శుక్రవారం బొంతపల్లిలోని న్యూ లాండ్ ఫార్మా కంపెనీని సందర్శించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్, అధ్యాపకుడు డా.సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులు తరలి వెళ్లగా కంపెనీ మేనేజర్ రవికుమార్ విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. ఫార్మా రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కంపెనీ యంత్రాలు, ఔషధాల తయారీ విధానాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేశ్, సౌజన్య, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



న్యూల్యాండ్ కంపెనీ ఆవరణలో విద్యార్థులు

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు ఎల్లమ్మ కమాన్‌లో సీసీరోడ్డు పనులు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని అయా వార్డుల్లో మౌళిక వసతులు కల్పించడమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కమిషనర్ గణేశ్‌రెడ్డి, 6వ వార్డ్ కౌన్సిలర్ పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, కౌన్సిలర్లు , వార్డు ప్రజలు పాల్గొన్నారు.